విద్యుత్తు కాంతులతో లూథరన్ చర్చి

ప్రజాశక్తి -పార్వతీపురం టౌన్

క్రిస్మస్‌ను పురస్కరించుకుని క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేసేందుకు పట్టణంలోని బెలగాం చర్చి వీధి జంక్షన్ వద్ద గల లూథరన్ చర్చి విద్యుత్ కాంతులతో ముస్తాబైంది. సైనెడ్ ప్రెసిడెంట్ పిట్టల సుదర్శనరావు, సంఘకాపరి తోట రామారావు ఆధ్వర్యంలో శనివారం చర్చిని విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఈ విద్యుత్ దీప కాంతుల్లో చర్చి ప్రకాశ వంతంగా ఉండడంతో చూపరులకు ఆకర్షవంతంగా కనబడింది.

లూథరన్ చర్చి

ఫ్లడ్‌లైట్ల వెలుతురులో వెళ్తున్న ఆర్‌టిసి బస్సు

మన్యం గజగజ

- కమ్ముతున్న పొగమంచు
- భారీగా తగ్గిన ఉష్ణోగ్రతలు
- అనారోగ్యాల బారిన జనం

ప్రజాశక్తి - కురుపాం

మన్యంపై చలి పులి పంజా విసురుతోంది. ఉదయం 8గంటలు దాటినా ప్రజలు బయటకు రావడానికి ధైర్యం చేయలేకపోతున్నారు. పొగమంచు పూర్తిగా కమ్ముతోంది. దీనికి తోడు చల్లని గాలులు వీస్తుండడంతో ఎముకలు కొరికే చలి ప్రజల్ని వణికిస్తోంది. గతేడాది ఇదే రోజుల్లో రాత్రి వేళల్లో 22 నుంచి 23 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవ్వగా ఇప్పుడు 20 నుంచి 19 డిగ్రీలకు పడిపోతున్నాయి. ఆదివారం 19 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాబోయే రోజుల్లో కూడా ఇదే కొనసాగే అవకాశం కనిపిస్తోంది. దీంతో బయటకు రావాలంటే పిల్లలు, వృద్ధులు తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. దీంతో ప్రస్తుతం అనారోగ్య సమస్యలు ఎక్కువగా బయట పడుతున్నాయి.

పెరుగుతున్న చలి

వాతావరణంలో వేగంగా మార్పులు చోటు చేసుకుంటున్నాయి. పగటిపూట ఉష్ణోగ్రతలు 27 నుంచి 28 డిగ్రీలు వరకూ నమోదవుతుండగా రాత్రి వేళల్లో మాత్రం 20 నుంచి 19 డిగ్రీలకు పడిపోతున్నాయి. దీంతో ప్రజలు గజగజ వణుకుతున్నారు. సాయంత్రం 6 గంటల నుంచి క్రమంగా పెరుగుతున్న చలి తీవ్రత ఉదయం 8 గంటలు దాటినా తగ్గడం లేదు. ఈ చలి తీవ్రత రాబోవు రోజుల్లో మరింతగా పెరిగే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. ఉష్ణోగ్రతలు మరింత పడిపోయే అవకాశం ఉందంటున్నారు.

పొగమంచుతో ఇబ్బందులు

చలి తీవ్రత ఎక్కువగా ఉండడంతో పాటు పొగమంచు కురుస్తుండడంతో తెల్లవారుజాము నుంచి 7గంటల వరకూ రహదారుల్లో కర్ఫ్యూ వాతావరణం కనిపిస్తోంది. నిత్యం పలువురు చిరు వ్యాపారులు సొంత గ్రామాల నుంచి వివిధ వ్యాపారాల కోసం మండల కేంద్రాల నుండి గిరిజన గ్రామాలకు గిరిజన ప్రజలు మండల కేంద్రాలకు రాకపోకలు సాగిస్తుంటారు. సైకిళ్లు, మోటారు వాహనాలపై రావాల్సి వస్తుండడంతో ఆరోగ్య సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని వ్యాపారులు చెబుతున్నారు. మంచు ధాటికి ద్విచక్ర, పెద్ద వాహనాలు నడపడం డ్రైవర్లకు కష్టంగా మారుతోంది. ఈ నేపథ్యంలో పొగమంచు వల్ల ప్రమాదాలు సంభవిస్తున్నాయని భయాందోళనకు గురవుతున్నారు.

ఉన్ని దుస్తులకు పెరిగిన గిరాకీ

చలి తీవ్రత అంతకంతకు పెరుగుతున్న నేపథ్యంలో స్వెట్టర్లకు ఉన్ని దుస్తులకు భారీగా డిమాండ్ పెరుగుతోంది. మండల, జిల్లా కేంద్రాల్లో భారీగా స్వెటర్లు, ఉన్ని దుస్తులు అమ్మకందార్లు పెద్ద సంఖ్యలో దుకాణాలను నెలకొల్పి వ్యాపారాలు సాగిస్తున్నారు. చలి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని పలువురు వాటి కొనుగోలుకు క్యూ కడుతున్నారు.

వెంటాడుతున్న వ్యాధుల భయం

ప్రస్తుతం కరోనా కేసులపై అప్రమత్తంగా ఉండాలని వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు హెచ్చరిస్తున్న నేపథ్యంలో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఈ చలిలో వ్యాధులతో బాధపడేవారు జాగ్రత్తలు తీసుకోవడం తప్పనిసరి అని వైద్యులు చెబుతున్నారు. చలి వల్ల కొంతమంది ఊపిరితిత్తులు ఆయాసానికి గురవుతాయి. చర్మం పగుళ్లు బారడం ఆరంభమవుతుంది. మిగతా వారితో పోలిస్తే చలికాలం పసికందులు, వృద్ధులకే సమస్యలెక్కువ. ఈ కాలం నీళ్లల్లో రెసిస్టెన్స్ లోపించి ఊపిరితిత్తుల సామర్థ్యం తగ్గుతుంది. దగ్గుతో కఫాన్ని బయటికి తెప్పించే శక్తి లేకపోవడం వల్ల ఊపిరితిత్తుల్లో ఇన్ఫెక్షన్ ఎక్కువవుతుంది. వృద్ధుల్లో ప్రత్యేకించి ఆర్థరైటిస్ ఉంటే ఎముకలు మరింత బిగుసుకుపోయే ప్రమాదం ఉంది. కదలికలు తగ్గి కొన్నిసార్లు పట్టు తప్పి పడిపోయే ప్రమాదం కూడా ఉంటుంది. పసికందులను చలిగాలి సోకకుండా వెచ్చగా ఉంచాలి. స్వెటర్లు, మెత్తని రగ్గులు వాడాలి. చలికాలంలోనే గుండెపోటు వచ్చే అవకాశాలు ఎక్కువగానే ఉంటాయి. ఉష్ణోగ్రత పడిపోయినప్పుడు రక్తనాళాలు మూసుకుపోయి, రక్తాన్ని శరీర భాగాలకు పంపిణీ చేయడం గుండెకు కష్టమవుతుంది. ఈ స్థితిలో గుండె రక్తాన్ని పంపిణీ చేయడానికి ఎక్కువగా శ్రమిస్తుంది. దీనివల్ల రక్తపోటు పెరుగుతుంది. ప్రత్యేకించి వృద్ధుల్లో సిస్టాలిక్, డయాస్టాలిక్ రక్తపోట్లు రెండూ పెరుగుతాయి. ఆస్తమా వ్యాధిగ్రస్తులై ఉంటే వారిలో చల్లగాలి వల్ల శ్వాసనాళాలు కుంచించుకుపోతాయి.

మంటలు కాగుతున్న గిరిజనులు

జుంబిరి, మామిడిమానుగూడకు మధ్య పాడైన కల్వర్టును పరిశీలిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు

చెక్‌డ్యాములు నిర్మించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు

ప్రజాశక్తి - కురుపాం

గిరిజన ప్రాంతాల్లో చెక్ డాములు నిర్మించి గిరిజన రైతులకు సాగునీరందించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. మండలంలోని నీలకంఠాపురం పంచాయతీలో గల జుంబిరి, మామిడిమానుగూడ గిరిజన గ్రామాలను ఆదివారం ఆయన సందర్శించి ఆ గ్రామాల్లో ప్రజలు పడుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో వరద ఎక్కువ వచ్చి ముగ్గురు ప్రాణాలు తీసిన జుంబరి గెడ్డ కల్వర్టు నిర్మాణం చేపట్టాలని, కుమ్మరిపొలంగెడ్డ, మాలమానుపొలం చెక్‌డాములకు నిధులు కేటాయించి మరమ్మతులు చేపట్టినట్టయితే సుమారు 600 ఎకరాలకు సాగునీరందుతుందన్నారు. కావున ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి చెక్ డాములు నిర్మాణానికి నిధులు మంజూరు చేసి గిరిజనులను ఆదుకోవాలని కోరారు. గిరిజన ప్రాంతాల్లోని సమస్యలపై జనవరి 10న కలెక్టరేట్ వద్ద చేపట్టనున్న ధర్నాకు పెద్దఎత్తున గిరిజనులు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

గుంతల రోడ్డును వెంటనే బాగు చేయాలి

మండలంలోని గుజ్జువాయి పంచాయతీ డి.బారామణి, బారామణిగూడ తదితర ఐదు గిరిజన గ్రామాలకు రాకపోకలకు ఉపయోగపడే రోడ్డు గతుకుల మయమైందని, వెంటనే ఈ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని రెడ్డి వేణు డిమాండ్ చేశారు. గిరిజన గ్రామాల్లో సందర్శించిన ఆయన మాట్లాడుతూ నిధులు ఉన్నాయని మండల అధికారులు చెబుతున్నారు తప్ప రోడ్డు వేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాకాలంలో ఈ రహదారి పూర్తిగా గొంతుల రోడ్డుతో ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అలాగే అత్యవసర సమయంలో ప్రాణాలు విడిచి పెట్టే సంఘటన ఎన్నో ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కావున ఇప్పటికైనా అధికారులు, ప్రభుత్వం స్పందించి తక్షణమే రోడ్డు మరమ్మతులు చేపట్టాలని కోరుతూ ఈనెల 29న గాంధీనగర్ మెయిన్ రోడ్డు వద్ద ఐదు గ్రామాల గిరిజన ప్రజలతో నిరసన కార్యక్రమం చేపడతామని అన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు కోరాడ ఈశ్వరరావు, వి.వాసు, అంగధ, బిడ్డకి వెంకట్రావు, ఆరికి గిరి, స్థానికులు గిరిజనులు పాల్గొన్నారు.

ప్రతిభే కొలమానంగా 'ఆడుదాం ఆంధ్ర' పోటీలు

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

క్రీడాకారుల్లో ఇమిడివున్న ప్రతిభను కొలమానంగా గుర్తించి వెలికి తీసేందుకే ఆడుదాం ఆంధ్రా పోటీలు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ అర్.గోవిందరావు అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి అర్‌సిఎం స్కూల్ వరకు నిర్వహించిన ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల అవగాహనా చైతన్య ర్యాలీని జాయింట్ కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో క్రీడల్లో లాంఛనంగా పాల్గొని క్రీడాకారుల్లో ఉత్తేజాన్ని నింపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 26 నుంచి ఫిబ్రవరి 10 వరకు 47 రోజుల పాటు ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలు జరగనున్నట్లు తెలిపారు. గ్రామ సచివాలయం, మండల, నియోజక వర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిలో క్రికెట్, వాలీ బాల్, కబడ్డీ, టెన్ని క్యాయిట్, ఖో ఖో విభాగాల్లో పోటీలను సందడిగా నిర్వహించాలన్నారు. క్రీడాకారుల నైపుణ్యాన్ని గుర్తించి, ప్రోత్సహించాలన్న సదుద్దేశంతో రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం వినూత్నంగా క్రీడా పోటీలు నిర్వహిస్తుందన్నారు. క్రీడలు మానసిక దృఢత్వానికి, ఉల్లాసానికి దోహదపడతాయన్నారు. క్రీడాకారులు గెలుపు, ఓటమిలను స్ఫూర్తిగా తీసుకొని స్నేహభావంతో మెలగాలన్నారు. ప్రతిభను చాటేందుకు క్రీడాకారులకు మంచి వేదిక ఆడుదాం ఆంధ్ర పోటీలని స్పష్టం చేశారు. ఈ అవకాశాన్ని క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అర్జున అవార్డు గ్రహీత ఎస్.జయరాం, జిల్లా క్రీడాభివద్ధి అధికారి ఎస్.వెంకటేశ్వరరావు, జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ టి.జగన్మోహన్‌రావు, మున్సిపల్ కమిషనర్ జె.రామ అప్పలనాయుడు, ఎంఇఒ ప్రసాదరావు, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు వర ప్రసాద్, సిహెచ్.రత్నాకర్, పిసి శ్రీనివాసరావు, శ్రీధర్, క్రీడా శిక్షకులు గణేష్, రవి, ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ ఆడుతున్న జెసి గోవిందరావు

సాలూరు : ర్యాలీని ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఈశ్వరమ్మ

26 నుంచి 'ఆడుదాం ఆంధ్ర'

సీతానగరం : ఈనెల 26 నుంచి ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం జరుగుతుందని ఎంపిడిఒ ఎంఎస్ఎల్ఎన్ ప్రసాద్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని పంచాయతీల నుండి ఈ కార్యక్రమంలో ఎక్కువ మంది హాజరయ్యేలా చూడాలన్నారు. అలాగే ఇప్పటికే టీములు వేయడం జరిగిందన్నారు. సీతానగరం, బూర్జ, గాదిలివలస, నిడగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల మైదానాల్లో ఈ పోటీలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో పిఇటి శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ర్యాలీ ప్రారంభించిన మున్సిపల్ చైర్‌పర్సన్

సాలూరు : రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంద్రా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వుల ఈశ్వరమ్మ కోరారు. ఆదివారం స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఆమె ర్యాలీని ప్రారంభించారు. మున్సిపల్ కమిషనర్ టి.జయరాం ఆధ్వర్యాన నిర్వహించిన ర్యాలీ ప్రధాన రహదారి మీదుగా సాగింది. 15ఏళ్లు దాటిన వారంతా ఈ క్రీడల్లో పాల్గొనవచ్చని చెప్పారు. యువతలో క్రీడా నైపుణ్యాలు వెలికి తీయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టిందని చెప్పారు. యువకులు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిడిఒ జి.పార్వతి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

చైర్మన్ గిరి కోసం ఎదురుచూపులు

ఇంకా తేల్చని ట్రస్టు బోర్డు

నేడు శంబరలోకి పెద్ద పోలమాంబ ప్రవేశం

ప్రజాశక్తి - మక్కువ

రాష్ట్ర జాతరగా అవతరించిన శంబర పోలమాంబ అమ్మవారి జాతరకు సంబంధించి ట్రస్ట్ బోర్డు చైర్మన్ గిరి కోసం వైసిపిలోని రెండు గ్రూపులు ఎదురుచూస్తున్నాయి. జాతర సమీపిస్తున్నప్పటికీ ట్రస్ట్ బోర్డు ఏర్పాటుపై అధికారులు, రాజకీయ నాయకులు ఇప్పటికీ స్పష్టత ఇవ్వలేదు. ఈనెల 14తోనే పాత ట్రస్టు బోర్డు రెండేళ్ల గడువు ముగిసింది. జనవరి 22, 23, 24 తేదీల నుంచి మార్చి వరకు 10 వారాల పాటు ఈ జాతర జరగనుంది. ఇప్పటికే జాతరకు సంబంధించి ఏర్పాట్లపై అధికారులతో జిల్లా కేంద్రంలో ఆర్‌డిఒ ఆధ్వర్యంలో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశంలోనూ ట్రస్టు బోర్డు అంశం ప్రస్తావనకు రానట్టు తెలిసింది. ఇప్పటికే శంబరలోని వైసిపిలో రెండు గ్రూపులు ట్రస్ట్ బోర్డు ఏర్పాటు కోసం ఎదురుచూస్తూ చైర్మన్ గిరి కోసం ఎవరి ప్రయత్నాలు వారు కొనసాగిస్తూనే ఉన్నారు. ఇప్పటి వరకు ఒక గ్రూపునకు చెందిన పూడి దాలి నాయుడు ట్రస్ట్ బోర్డు చైర్మన్‌గా రెండేళ్లు కొనసాగారు. ఈసారి ట్రస్టు బోర్డు ఏర్పాటైతే చైర్మన్ పదవి కోసం తీళ్ల తిరుపతిరావు గ్రూపు ఆశగా ఎదురు చూస్తోంది. గతంలో వయసు రీత్యా మండలంలోని వైసిపి నాయకత్వం పూడి దాలినాయుడుకు ఈ అవకాశం కల్పించింది. అయితే ఈసారి తమ గ్రూపునకు చైర్మన్ పదవి ఇవ్వాలని తిరుపతిరావు వర్గం గట్టిగా ప్రయత్నాలు కొనసాగిస్తుంది. ఇదిలా ఉండగా శంబరలో ఉన్న రెండు గ్రూపులను వైసిపి నాయకత్వం ఎవరిని కాదనలేక చెరోచేత్తో నడిపిస్తూ వస్తుంది. గతంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసిపి రెండు గ్రూపులుగా ఏర్పడింది. అప్పట్లో సర్పంచ్ ఎన్నికల్లో కలిసి పని చేసినా, ఎంపిటిసి ఎన్నికల సమయంలో చీలిక ఏర్పడింది. తిరుపతిరావు గ్రూపులోని గంజి అప్పలనాయుడుకు ఎంపిటిసి టికెట్ ఇవ్వాలని పట్టు పట్టినప్పటికీ చివరి నిమిషంలో అధిష్టానం దాలినాయుడు తమ్ముడు లక్ష్మణరావుకు సీటు ఇవ్వడంతో విభేదాలు ఏర్పడ్డాయి. దీంతో తిరుపతిరావు గ్రూపు బాహాటంగానే టిడిపి అభ్యర్థి పోలినాయుడు గెలుపునకు సహకరించింది. దీంతో అప్పటి నుంచి విభేదాలు అలాగే ఉన్నాయి. ఏది ఏమైనా ఈసారి ట్రస్ట్ బోర్డు ఏర్పాటైతే తిరుపతిరావు గ్రూపునకే చైర్మన్ అవకాశం దక్కుతుందేమోనని పలువురు అభిప్రాయపడుతున్నారు. ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు ట్రస్ట్ బోర్డు ఏర్పాటు అంశం తేలకపోవడంతో ఆశావాహులకు అంతర్ మదనం తప్పడం లేదు. ఇదిలా ఉండగా ఈ ఏడాది ఏ విధమైన కమిటీలు లేకుండా దేవాదాయశాఖ అధికారుల పర్యవేక్షణలో జాతర జరిగే ఆస్కారం ఎక్కువగా కనిపిస్తోందని పలువురు చర్చించుకుంటున్నారు.

పెద్దపోలమాంబ గుడి

నేడు శంబరలోకి పెదపోలమాంబ

జాతరలో తొలి ఘట్టమైన పెదపోలమాంబ అమ్మవారిని గ్రామంలోకి సోమవారం తీసుకురానున్నారు. సోమవారం నుంచి జనవరి 3 వరకు పెద్ద పోలమాంబ భక్తుల పూజలు అందుకోనుంది. అనంతరం పోలమాంబ జాతరకు సన్నద్ధం మొదలవుతుంది. సోమవారం రాత్రి పోలమాంబ ఆలయ కార్యనిర్వహణ అధికారి వివిఎస్ నారాయణ ఆధ్వర్యంలో పెద్ద పోలమాంబను మేళతాళాల నడుమ భక్తిశ్రద్ధలతో గ్రామంలోకి కొని తీసుకురానున్నారు.

పార్వతీపురంలో గాంధీ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

ప్రభుత్వ మొండి వైఖరి నశించాలి

కొవ్వొత్తులతో అంగన్‌వాడీల నిరసన ● 13వ రోజుకు చేరిన నిరవధిక సమ్మె

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

సిఎం జగన్మోహన్‌రెడ్డి మొండి వైఖరి నశించాలని అంగన్వాడీ కార్యకర్తలు కొవ్వొత్తులతో ఆదివారం రాత్రి నిరసన తెలిపారు. పార్వతీపురంలో సిఐటియు ఆధ్వర్యంలో నాలుగు రోడ్ల కూడలి వద్ద ఉన్న మహాత్మా గాంధీ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో ప్రదర్శనలు నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. సిఎం జగన్మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, తెలంగాణ రాష్ట్రం కంటే అదనంగా జీతాలు ఇవ్వాలని, రాజకీయ జోక్యం ఉండరాదని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యుటీ ఇవ్వాలని, జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ, నాయకులు బంకురు సూరిబాబు, అంగన్వాడీ సెక్టార్ లీడర్లు, అంగన్వాడి కార్యకర్తలు, పాల్గొన్నారు..

పార్వతీపురంరూరల్ : అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో స్థానిక కలెక్టరేట్ వద్ద జరుగుతున్న సమ్మె ఆదివారం 13వ రోజు విజయవంతంగా కొనసాగింది. ఆ సంఘం జిల్లా కార్యదర్శి గంట జ్యోతి, ప్రాజెక్టు నాయకులు మద్రాపు అలివేలు, గౌరి, సిఐటియు నాయకులు బి.లక్ష్మి ఆధ్వర్యాన కలెక్టరేట్ ఎదుట నిరసనలో అంగన్వాడీలు ఒంటికాలుపై నిలబడి, కళ్లు మూసుకొని వినూత్న రీతిలో నిరసన తెలిపారు. కార్యక్రమంలో పెద్దసంఖ్యలో అంగన్వాడీలు పాల్గొన్నారు.

సీతంపేట : స్థానిక ఐటిడిఎ ఎదుట అంగన్వాడీల సమ్మె ఆదివారం కొనసాగింది. ఈ సందర్భంగా అంగన్వాడీలు కొవ్వొత్తుల ర్యాలీతో నిరసన తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి ఎం.కాంతారావు అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్ యూనియన్ ప్రాజెక్టు అధ్యక్ష కార్యదర్శులు, ఎ.పార్వతి, ఎ.దర్శమి తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.

టిడిపి నాయకులు భూదేవి సంఘీభావం

అంగన్వాడీల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని టిడిపి నాయకులు పడాల భూదేవి డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు జగన్మోహనరెడ్డి అంగన్వాడీ టీచర్ల జీతాలను తెలంగాణా కంటే రూ.వెయ్యి అదనంగా పెంచుతామని హామీ ఇచ్చి ఇప్పుడు మాట తప్పడం అన్యాయన్నారు. తక్షమే అంగన్వాడీ వర్కర్ల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

కొమరాడ : తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. 13వ రోజు కొమరాడ మండల కేంద్రంలో జరిగే సమ్మెలో మజ్జి గౌరమ్మ తల్లి ఫోటోకు పూలమాల వేస్తూ కొబ్బరికాయలతో పూజలు చేస్తూ మా కోరికలు తీర్చమని మోకాలితో మొక్కుతూ నిరసన కార్యక్రమం చేపట్టారు. గ్రామ దేవత అసిరమ్మ రూపంలో ఊగుతూ తమ కోర్కెలు తీర్చమని నిరసనలో అంగన్వాడీ సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ కొమరాడ ప్రాజెక్టు ఉపాధ్యక్షులు సిరికి అనురాధ, నాయకులు మంగ సుజాత, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి, పలువురు అంగన్వాడీలు పాల్గొన్నారు.

సీతానగరం: అంగన్‌వాడీల నిరవధిక సమ్మెను విరమింప చేసేందుకు ప్రభుత్వం కృషి చేయాలని సిఐటియు మండల నాయకులు గవర వెంకటరమణ కోరారు. ఈ మేరకు క్రిస్మస్ పర్వ దినాన్ని పురస్కరించుకొని సిఎం జగన్‌మోహన్‌రెడ్డి తాను నమ్మిన జీసస్ క్రీస్తు చూపిన శాంతి మార్గంలో అంగన్వాడీలు సమస్యలు పరిష్కరించే చూడాలని కోరారు. కార్యక్రమంలో సెక్టార్ నాయకులు పి.యశోద, మరిచర్ల సునీత, ఎస్.సుజాత, ఎస్.శ్రీదేవి, చింతాడ సుగుణ, సుక్క ఈశ్వరమ్మ తదితర అంగన్వాడీలు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం సమ్మెనుద్దేశించి మాట్లాడుతున్న ఈశ్వరరావు

సీతంపేటలో కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

గుమ్మలక్ష్మీపురం : మండలం కేంద్రంలో అంగన్వాడీలు చేపడుతున్న సమ్మె 13వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా అంగన్వాడీలకు మద్దతుగా ప్రజానాట్యమండలి జిల్లా కన్వీనర్ కోరాడ ఈశ్వరరావు మాట్లాడుతూ అంగన్వాడీలు చేస్తున్న న్యాయమైన పోరాటానికి రాష్ట్ర ప్రభుత్వం స్పందించి వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీలు చేస్తున్న పోరాటానికి ప్రజాసంఘాలతో పాటు ప్రజానాట్యమండలి అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ ఉద్యోగుల సంఘం ప్రాజెక్టు అధ్యక్ష కార్యదర్శులు లక్ష్మి, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

పాలకొండ: మండలంలోని బక్కూరులో కొవ్వుత్తులతో అంగన్‌వాడీలు నిరసన తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు హిమప్రభ, ఇందిర, గంగమ్మ, లత, గౌరి,శిరీష, బంగారి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్, ఎఇలకు సూచనలు చేస్తున్న రాజన్నదొర

గడపగడపకూ నిధులతో జనవరిలోగా పనులు

ప్రజాశక్తి - సాలూరు

మున్సిపాలిటీలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ప్రతిపాదించిన పనులు జనవరిలోగా పూర్తి చేయాలని డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర ఆదేశించారు. ఆదివారం మున్సిపల్ కమిషనర్ జయరాం, ఎఇ సూరినాయుడు ఆయన్ను కలిసిన సందర్భంగా మాట్లాడారు. సచివాలయానికి రూ.20లక్షలు చొప్పున నిధులు మంజూరయ్యాయని, త్వరలో పనులు ప్రారంభించాలని ఆదేశించారు. జనవరిలోగా పనులు పూర్తి చేస్తే బిల్లులు మంజూరవుతాయన్నారు. వార్డు కౌన్సిలర్లు, ఇంఛార్జిలు ఈ పనులు త్వరితగతిన జరిగేలా చూడాలని కోరారు. ఎన్నికల షెడ్యూల్ సంక్రాంతి తర్వాత ఎప్పుడైనా వచ్చే అవకాశం ఉందని చెప్పారు. మిగిలిన గ్రాంట్లుతో చేపట్టాల్సిన పనులు కూడా వేగవంతం చేయాలని కమిషనర్‌ను ఆదేశించారు.

కేక్ కట్ చేస్తున్న జయకృష్ణ

సెమీ క్రిస్మస్ వేడుకల్లో జయకృష్ణ

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలం తుడి గ్రామంలోని కానుకలు మాత ఆలయంలో ఆదివారం నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో పాలకొండ నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి నిమ్మక జయకృష్ణ పాల్గొన్నారు. చర్చిలో ప్రార్థనలు నిర్వహించి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో టిడిపి మండల ప్రధాన కార్యదర్శి సిహెచ్ ఉమామహేశ్వరరావు, కంబర ఎంపిటిసి సభ్యులు పొదిలాపు కృష్ణమూర్తి నాయుడు, టిఎన్‌టియుసి నాయకులు ఎన్.శశికుమార్, మాజీ సర్పంచి గొర్రెల గౌరునాయుడు, అలజంగి కృష్ణ, క్లస్టర్ కస్టమర్ ఇన్‌ఛార్జి జాడ శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పక్కన ఉన్న గోతులను తక్షణమే కప్పాలి

ప్రజాశక్తి - కొమరాడ

అంతర్ రాష్ట్ర రహదారి పక్కన పెద్దపెద్ద గోతులు కప్పకుండా వదిలేసిన బిఎస్‌ఎన్‌ఎల్ నెట్వర్క్ కాంట్రాక్ట్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద బిఎస్‌ఎన్‌ఎల్ నెట్వర్క్ కోసం తవ్విన ఎనిమిది అడుగుల గొయ్యిను సిపిఎం నాయకులు ఆదివారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తహశీల్దార్ కార్యాలయం నుంచి బిఎస్‌ఎన్‌ఎల్ కార్యాలయం వరకు 8 పెద్ద పెద్ద గొయ్యిలు నెట్వర్క్ వైరు కోసం తవ్వి నెలరోజులైనా ఆ వాటిని కప్పకపోవడంతో అటుగా ఉన్న తహశీల్దార్, పోలీస్ స్టేషన్‌కు, ఎంపిడిఒ, వెలుగు కార్యాలయాలకు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి నిత్యం రాకపోకలు ప్రజలు గొయ్యిలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏదైనా వాహనం పొరపాటున ఈ గోతిలో పడితే వారి పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. కావున ఈ గోతులు కప్పి అటు వాహనదారులను, ఇటు ప్రజల ప్రాణాలను కాపాడాలని స్థానికులు కోరుతున్నారు. పరిశీలనలో భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు యామక గౌరు నాయుడు పాల్గొన్నారు.

ఎంఇఒ-1 అసోసియేషన్ జిల్లా కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

జోగారావు

మండల విద్యాశాఖ అధికారులు -1 అసోసియేషన్ జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సామల సింహాచలం ఆదివారం ఒక ప్రకటన లో తెలిపారు. జిల్లా అధ్యక్షులుగా పల్లి జోగారావు (పాచిపెంట), ప్రధాన కార్యదర్శిగా ఎన్.నాగభూషణరావు (గరుగుబిల్లి), గౌరవాధ్యక్షులుగా పర్రి కృష్ణమూర్తి (పాలకొండ), ఉపాధ్యక్షులుగా ధనుకొండ గౌరునాయుడు (వీరఘట్టం), జిల్లా కోశాధికారిగా బత్తుల రాజ్‌కుమార్ (సాలూరు), జిల్లా కార్యదర్శులుగా సత్యనారాయణ (మక్కువ), ఆనందరావు (సీతంపేట) ఎంపికయ్యారు.

నాగభూషణరావు

డప్పులు, వాయిద్యాల నడుమ అమ్మవారిని ఊరేగిస్తున్న గిరిజనులు

ఘనంగా కందికొత్తల పండగ

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

స్థానిక హెచ్ గ్రౌండ్ క్రీడా మైదానంలో కందికొత్తల ఉత్సవాలు గిరిజనులు కన్నుల పండుగ జరుపుకున్నారు. గిరిజన సాంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు చాటి చెప్పేలా కందికొత్తల ఉత్సవాల్లో గిరిజనులు భాగస్వామ్యమయ్యారు. కప్పరమ్మ, జాకారమ్మ, గొడ్డలమ్మకు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. పంటలు బాగా పండాలని, తమ ఇంట సిరిసంపదలు నిండాలని, పిల్లాపాపలతో సుఖసంతోషాలతో ఉండాలని వేడుకున్నారు. డప్పు, వాయిద్యాలతో గిరిజన మహిళలు జట్టుకట్టు నృత్యాలు చేస్తూ పలువురుని ఆకట్టుకున్నారు. పలు గ్రామాల్లో గొడ్డలమ్మను ఊరేగించి పూజలు నిర్వహించారు.

విరివిగా మొక్కలు నాటాలి

ప్రజాశక్తి - పాలకొండ

పర్యావరణ పరిరక్షణకు విరివిగా మొక్కలు నాటుతామని సత్య సేవా సంస్థల రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.లక్ష్మణరావు తెలిపారు. ఆ సంస్థల జిల్లా సమావేశం పాలకొండలో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో సేవా కార్యక్రమాలు విరివిగా చేపడుతామన్నారు. ప్రతి భక్తుడు కనీసం ఏడు మొక్కలు నాటి పర్యావరణాన్ని సంరక్షించాలన్నారు. అవసరమైతే మొక్కలు తామే అందిస్తామన్నారు. వీరఘట్టం మండలం చట్టపులివలస సత్య మందిరాన్ని సత్యసాయి సామాజిక సేవ మందిరంగా మార్పు చేస్తున్నామన్నారు. ఈ కేంద్రం ద్వారా యువతకు, మహిళలకు వేర్వేరుగా ఉపాధి శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. గ్రామాల్లో వైద్య శిబిరాలు, పేదలకు ఆర్థిక సాయం తదితర సేవా కార్యక్రమాలు భవిష్యత్తులో ఈ కేంద్రం ద్వారా చేపడతామన్నారు. ఈ కేంద్ర నిర్వహణ బాధ్యతను పుట్టపర్తి సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరుగుతాయని వెల్లడించారు. సత్యసాయి బాబా జయంతి సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు పి.నేతాజీ నాయుడు, ఐటి విభాగం రాష్ట్ర బాధ్యులు ఆర్.కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ఇరిగేషన్ పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు భయపడుతున్నారు. రాష్ట్రంలో వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధి పనులు చేస్తున్న కాంట్రాక్టర్లకు బిల్లులు సక్రమంగా చెల్లించడం లేదు. దీంతో అభివృద్ధి పనులకు టెండర్లు పిలుస్తున్నప్పటికీ కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. ఐదు ఇరిగేషన్ ప్యాకేజీ పనులకు టెండర్లు పిలిస్తే రెండింటికి టెండర్లు వేయడమే అందుకు నిదర్శనం. మూడు ప్యాకేజీ పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రాలేదు. ఖరారైన టెండర్లలో పనులు ముందుకు సాగకపోవడం గమనార్హం.

బాబోయ్.. ఇరిగేషన్ పనులు

- చెరువుల అభివృద్ధికి రూ.9.26 కోట్లు మంజూరు
- ఐదు ప్యాకేజి పనులకు రెండింటికి మాత్రమే టెండర్లు
- మూడు పనులకు ముందుకురాని కాంట్రాక్టర్లు

ప్రజాశక్తి-బొబ్బిలి

విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో చెరువులను అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఐదు ప్యాకేజీల కింద 20 చెరువుల అభివృద్ధికి రూ.9.26 కోట్లు కేటాయించింది. మొదటి ప్యాకేజీలో బాడంగి, సాలూరు, తెర్లాం మండలాల్లో ఐదు చెరువుల అభివృద్ధికి రూ.2.37 కోట్లు ప్రభుత్వం కేటాయించింది. పనుల కోసం మూడు సార్లు టెండర్లు పిలిచింది. ఒకసారి కూడా టెండర్ పడలేదు. రెండో ప్యాకేజీలో మక్కువ మండలంలో 2, గరుగుబిల్లి మండలంలో రెండు చెరువులకు రూ.1.87 కోట్లను ప్రభుత్వం కేటాయించింది. పనులు చేసేందుకు కాంట్రాక్టర్ ముందుకొచ్చి, పనులు ప్రారంభించినా నత్తనడకన సాగుతున్నాయి. మూడో ప్యాకేజిలో పార్వతీపురం మండలంలో మూడు చెరువులకు రూ.1.86 కోట్లు మంజూరయ్యాయి. కాంట్రాక్టరు టెండరు వేసి ఒప్పందం జరిగినప్పటికీ పనులు కావడం లేదు. నాలుగో ప్యాకేజీలో బలిజిపేట మండలంలోని నాలుగు చెరువులకు రూ.2.10 కోట్లు మంజూరయ్యాయి. మూడు సార్లు టెండర్లు పిలిచినా ఒకసారి కూడా టెండరు పడలేదు. ఐదో ప్యాకేజీలో బాడంగి మండలంలో ఒకటి, గరుగుబిల్లి మండలంలో ఒకటి, బలిజిపేట మండలంలో రెండు చెరువులకు రూ.1.06 కోట్లు మంజూరయ్యాయి. రెండు సార్లు టెండర్లు పిలవగా ఒక్కసారి కూడా టెండరు దాఖలు కాలేదు. దీన్నిబట్టి పరిస్థితి ఎంత అధ్వానంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

ప్రపంచ బ్యాంకు నిధులకూ..

ఉమ్మడి విజయనగరం జిల్లాలో ప్రపంచ బ్యాంకు నిధులు ఆరు చెరువుల అభివృద్ధికి రూ.6.61 కోట్లు మంజూరయ్యాయి. చెరువుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం వాటా 30 శాతం, ప్రపంచ బ్యాంకు వాటా 70 శాతంతో ఆరు చెరువులకు రూ.6.61కోట్లు మంజూరయ్యాయి. ఆరు చెరువులకు టెండర్లు పూర్తి అయినప్పటికీ మూడు చెరువుల పనులు ప్రారంభమే కాలేదు. మూడు చెరువుల పనులు ప్రారంభమైనా నత్తనడకన సాగుతున్నాయి. బాడంగి మండలంలోని బొమ్మినాయుని చెరువుకు రూ.1.1 కోట్లు, సీతానగరం మండలంలోని తుంబా చెరువుకు రూ.42 లక్షలు, బలిజిపేట మండలంలోని గొల్లంపి చెరువుకు రూ.1.93కోట్లు మంజూరైనా పనులు ప్రారంభం కాలేదు. తెర్లాం మండలంలోని రాణి చెరువుకు రూ.85 లక్షలు మంజూరు కాగా రూ.18 లక్షల పనులు మాత్రమే పూర్తి చేశారు. మెరకముడిదాం మండలంలోని కోమటి చెరువుకు రూ.82 లక్షలు మంజూరు కాగా, ఇప్పటి వరకు రూ.21 లక్షల పనులు, సదాశివుని చెరువుకు రూ.2.1 కోట్లు మంజూరు కాగా రూ.41.4 లక్షల పనులు మాత్రమే పూర్తయ్యాయి. బిల్లులు సకాలంలో అవ్వకపోవడం వల్లే కాంట్రాక్టర్లు పనులు చేసేందుకు ముందుకు రావడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

రైతులకు అందని సాగునీరు

చెరువుల అభివృద్ధి పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో రైతులకు సక్రమంగా సాగునీరు అందడం లేదు. సాగునీరు అందకపోవడంతో పంటలు సక్రమంగా పండక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. చెరువులను అభివృద్ధి చేసి రైతులకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని పలువురు కోరుతున్నారు.

కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు

చెరువుల అభివృద్ధి పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. కొన్ని చెరువులకు పూర్తిగా టెండర్లు వేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. మరికొన్ని చెరువులలో పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు వచ్చినా, వేగవంతంగా చేయడం లేదు. అభివృద్ధి పనులు వేగవంతం అయ్యేలా చర్యలు తీసుకుంటాం.

- వైవి రాజేశ్వరి, ఇరిగేషన్ ఎస్ఇ

మురికి కాలువలో పేరుకుపోయిన సీసాలు

ఏ కాలువలో చూసినా ప్లాస్టిక్ కవర్లు, సీసాలు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

స్థానిక మున్సిపాల్టీ పరిధిలో గల ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న కాలువల్లో అక్కడక్కడ ప్లాస్టిక్ ఖాళీ వాటర్ బాటిళ్లు, మద్యం ఖాళీ సీసాలే దర్శనమిస్తున్నాయి. స్థానిక ప్రజలు డస్ట్‌బిన్‌ల్లో వేయాల్సిన ఈ వ్యర్థాలను కాలువలో వేయడం వల్ల మురుగునీరు వెళ్లేందుకు అవకాశం లేకుండా పోవడంతో, మున్సిపల్ ప్రజారోగ్య విభాగాల్లో విధులు నిర్వహించే పారిశుధ్య కార్మికులకు, పారిశుధ్య నిర్వహణను సక్రమంగా మెరుగుపర్చేందుకు అవకాశం లేకుండా పోతుంది. ఈ సమస్యపై మున్సిపల్ ప్రజారోగ్య అధికారులు, సచివాలయాల శానిటరీ సెక్రటరీలు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి షాపుల వద్ద డస్ట్ బిన్‌లను ఏర్పాటు చేసుకునేలా వ్యాపారస్తులకు అవగాహన కల్పించి, నిబంధనలు అతిక్రమించే వారి నుండి అపరాధ రుసుము వసూలు చేసేలా కృషి చేసి స్వచ్ఛ పార్వతీపురం దిశగా అడుగులు వేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

అరాచక పాలన అంతమే లక్ష్యం

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

రాష్ట్రంలోని అన్ని వర్గాలు వైసిపి పాలనలో అనుభవిస్తున్న అరాచకాలను అంతమొందించడమే లక్ష్యంగా పనిచేయాలని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు కిమిడి కళా వెంకట్రావు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక బైపాస్ రోడ్‌లో ఏర్పాటు చేసిన నియోజకవర్గ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి బోనెల విజయచంద్ర అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజకీయాల్లో ఫ్యాక్షినిజంతో ప్రత్యర్థులతో పాటు ప్రజలను అంతమొందించడమే లక్ష్యంగా పరిపాలన కొనసాగిస్తున్న వైఎస్ జగన్మోహన్ రెడ్డి అహంకారాన్ని అణిచివేసి తిరిగి కోలుకోలేని విధంగా బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. సంక్షేమ పథకాల పేరిట కోట్లాది రూపాయల రుణ భారాన్ని ప్రజలపై మోపి రాబోయే 20 ఏళ్లకు సరిపడా అప్పు చేసి రాష్ట్రాన్ని ఆర్థికంగా దివాళా తీయించారన్నారు. నాలుగున్నరేళ్ల నియంత పాలనకు ప్రజలు విసిగిపోయి ఇప్పుడిప్పుడే అన్ని వర్గాలు రోడ్ల మీదకు వస్తున్నాయన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కాంట్రాక్టు అవుట్సోర్సింగ్ ఉద్యోగులతో పాటు అంగన్వాడీ, ఆశాలకు అలవికాని హామీలు ఇచ్చి ఇప్పుడు అమలు చేయమని కోరితే నిర్బంధాలు విధిస్తున్నారని అన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన అంగన్వాడీ కేంద్రాల తాళాలను ప్రభుత్వమే బద్దలు కొట్టాలని ఉత్తర్వులు ఇవ్వడం ఈ ప్రభుత్వ దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. నూతన కార్యాలయం వేదికగా కార్యకర్తలు, నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు ఒకరికొకరు సమన్వయపర్చుకుంటూ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని కోరారు. అనంతరం అరుకు పార్లమెంటు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి కిడారి శ్రావణ్ కుమార్, జిల్లా టిడిపి అధ్యక్షులు గుమ్మడి సంధ్యారాణి, బొబ్బిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బేబీ నాయనా మాట్లాడారు. కార్యక్రమంలో పాలకొండ, కురుపాం నియోజకవర్గాల టిడిపి ఇన్‌ఛార్జులు నిమ్మక జయకృష్ణ, తోయక జగదీశ్వరి, మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులుతో పాటు సీతానగరం, బలిజిపేట, పార్వతీపురం నుండి పెద్ద ఎత్తున కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు కళా

పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న కళావెంకట్రావు

పార్కుకు పోటెత్తిన పర్యాటకులు

ప్రజాశక్తి - సీతంపేట

హ్యాంగింగ్ బ్రిడ్జిపై నడిచి వెళ్తున్న యువత

స్థానిక ఎన్టీఆర్ అడ్వెంచర్ పార్కులో ఆదివారం సెలవు దినం రావడంతో క్రిస్మస్ వేడుకలు సందర్భంగా పర్యాటకులు వచ్చారు. జిల్లా నలుమూలల నుంచే కాకుండా ఇతర జిల్లాల నుండి కూడా పర్యాటకులతో అడ్వెంచర్ పార్క్ కిటకిటలాడింది. పార్కులో ఉన్న అందాలను ఆశ్వాదించారు. హ్యాంగింగ్ బ్రిడ్జిపై యువతీ యువకులు నీటి మీద నడక నడిచి వెళ్లారు. ఆల్ ట్రైన్ వెహికల్‌లో పార్కు అంతా చుట్టుముట్టారు. జల విహార్ వద్ద యువతీ యువకులు బోటు షికారు చేశారు. చిన్నారులు మినీ ట్రైన్ ఎక్కి ఆనందంగా గడిపారు. చిన్నారులు కమాండ్ నెట్, మినీ బోటింగ్ చేశారు. స్కై సైకిల్ ఎక్కి ఆకాశంలో చక్కెర కొట్టారు. ఫైవ్ డి థియేటర్‌లో హర్రర్ పిక్చర్ వీక్షించారు. సాహసపేతమైన క్రీడల్లో పాల్గొన్నారు. ఆనంద విహార్ వద్ద డాన్సులు వేసి ఉల్లాసంగా, ఉత్సాహంగా డాన్సులు వేశారు. అనంతరం మెట్టుగూడ జలపాతాన్ని సందర్శించి జలకాలాడారు.

సమావేశంలో మాట్లాడుతున్న శ్రామిక మహిళా జిల్లా నాయకులు ఇందిర

విఒఎల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

విఒఎలు దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారం చేయాలని, మూడేళ్ల కాలపరిమితి జీవో రద్దు చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మథరావు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సుందరయ్య భవనంలో విఒఎల సంఘం జిల్లా నాయకులు ధర్మారావు అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశంలో యమ్మల మన్మథరావు, శ్రామిక మహిళా సంఘం జిల్లా నాయకులు వి.ఇందిర, సిఐటియు కోశాధికారి గొర్లి వెంకటరమణ మాట్లాడుతూ గ్రామంలో విఒఎలు ఎన్నో సేవలు అందిస్తున్నారని, విఒఎల సేవల వల్ల ప్రభుత్వానికి ఎంతో పేరు వస్తుందని, గ్రామంలో కొత్త గ్రూప్ ఏర్పాటు చేయడం బ్యాంకు లింకేజీలు ఇప్పించడం శ్రీనిధి అప్పులు ఇప్పించడం వసూలు చేయడం, రాజకీయ నాయకులు మీటింగులకు గ్రామస్తులను కదిలించడం వంటి అనేక సేవలు చేస్తున్నారని అన్నారు. అయినా ప్రభుత్వం విఒఎలను గుర్తించడం లేదన్నారు. మూడేళ్ల కాల పరిమితి జీవో రద్దు చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని, రూ.10 లక్షలతో గ్రూప్ ఇన్సూరెన్స్ కల్పించాలని, విఒఎల మేర్జ్ ఆపాలని, అన్ని బకాయిలు చెల్లించాలని, మెర్జ్ వల్ల నష్టపోయిన విఒఎలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విఒఎ సంఘం నాయకులు సుందరరావు, శ్రీదేవి, రవణమ్మ, కుమారి, అన్ని మండలాల నుంచి విఒఎలు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

డివైడర్‌ను ఢీకొని యువకుడు మృతి

ప్రజాశక్తి- డెంకాడ

మండలంలోని నాతవలస 16వ జాతీయ రహదారి టోల్గేట్ సమీపంలో డివైడర్‌ను ఢీకొని శనివారం యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. నాతవలస గ్రామానికి చెందిన గేదెల ప్రవీణ్ కుమార్ (29) తన మోటార్ సైకిల్ పై నాతవలస టోల్‌ప్లాజా నుంచి తిరిగి తన స్వగ్రామానికి వస్తున్న సమయంలో బైక్ అదుపు తప్పి డివైడర్‌ను బలంగా ఢీకొన్నాడు. ఈప్రమాదంలో తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య గంగోత్రితో పాటు సంవత్సరం ఆరు నెలల బాబు ఉన్నాడు. మృతుడు నాతవలస టోల్ గేట్‌లో పనిచేస్తున్నాడు. భార్య ఫిర్యాదు మేరకు స్థానిక ఎస్ఐ యు మహేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆరుగురు జూదగాళ్లు అరెస్టు

ప్రజాశక్తి- డెంకాడ

మండలంలోని మోపాడ సమీపంలో పేకాట ఆడుతున్న వారిపై దాడి చేసి ఆరుగురు వ్యక్తులను శనివారం అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.40వేలు నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ యు మహేష్ తెలిపారు. తమకు వచ్చిన ముందస్తు సమాచారం ఆదారంగా దాడులు చేసినట్లు తెలిపారు.

మున్సిపల్ కార్మికుల బైక్ ర్యాలీ

ప్రజాశక్తి - సాలూరు

పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న మున్సిపల్ కార్మికులు

ఈనెల 26నుంచి చేపట్టనున్న సమ్మెకు మద్దతు తెలపాలని కోరుతూ మున్సిపల్ కార్మికులు ఆదివారం బైక్ ర్యాలీ చేపట్టారు.మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ పట్టణ నాయకులు టి.శంకర్ ఆధ్వర్యాన నిర్వహించిన ర్యాలీ పట్టణ ప్రధాన రహదారి మీదుగా సాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనం 26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని కోరారు. ఫేస్ యాప్ రద్దు చేయాలని, పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. సమ్మెకు వెళ్లడానికి ప్రభుత్వ మొండి వైఖరే కారణమని చెప్పారు. ప్రజలు మద్దతు తెలపాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు పోలరాజు ,చంటి పాల్గొన్నారు.

కిక్ బాక్సింగ్ క్రీడాకారులను అభినందించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్


క్రీడాకారులను అభినందిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

కోల్‌కత్తా ఇటీవల జరిగిన అంతర్జాతీయ బాక్సింగ్ పోటీల్లో రాష్ట్రం తరుపున పాల్గొన్న నియోజకవర్గ క్రీడాకారులను ఆదివారం స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు తన క్యాంపు కార్యాలయంలో అభినందించారు. పార్వతీపురం ప్రాంతానికి చెందిన బూరి గణేష్ 21-22 కేజీల విభాగంలో బంగారు పతకం, 45-48, 63-65 కేజీల విభాగాల్లో తెంటు హేమంత్ రజత పతకాలు సాధించడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. ఆ క్రీడాకారులకు శిక్షణ అందజేసిన మండల శరత్, కె.విమల్ రాజ్, స్టేట్ జనరల్ సెక్రెటరీ బి అనిల్ కుమార్ ఈ పోటీల్లో పాల్గొనేందుకు ఎంతగానో సహాయ సహకారాలు అందచేసి, ప్రోత్సహించిన స్థానిక ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా విజయం సాధించిన క్రీడాకారులకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలియజేస్తూ తన వంతు ప్రోత్సాహం, సహాయ సహకారాలు అన్ని వేళలా ఉంటాయని తెలిపారు. అలాగే భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి మన ప్రాంతానికి తద్వారా రాష్ట్రానికి మంచి పేరు ప్రతిష్ఠలు తీసుకు రావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ సువ్వాడ లావణ్య, సచివాలయం కన్వీనర్ ఎస్.చంద్ర, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

టిడిపిలోకి కొండబాబు

ప్రజాశక్తి-గంట్యాడ

మండల కేంద్రం గంట్యాడకు చెందిన మాజీ ఎమ్‌పి కొండపల్లి పైడితల్లినాయుడు కుమారుడు కొండపల్లి కొండబాబు, మనుమడు శ్రీనివాస్ టిడిపిలో చేరారు. ఆదివారం ఉండవల్లిలో టిడిపి అధినేత చంద్రబాబునాయుడు సమక్షంలో మాజీ ఎమ్మెల్యే కె.ఎ.నాయుడు ఆధ్వర్యాన ఆ పార్టీలో చేరారు. వీరు గతంలో వైసిపిలో పనిచేసి, ఇటీవల రాజీనామా చేశారు. కొండబాబు టిడిపి తరపున గతంలో ఎంపిపిగా పనిచేశారు. విదేశాల్లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేసిన శ్రీనివాస్.. ఆరేళ్ల క్రితం నుంచి నియోజకవర్గంలో క్రియాశీల రాజకీయాల్లో చురుగ్గా వ్యవహరిస్తున్నారు. వీరితోపాటు నియోజకవర్గానికి చెందిన బిజెపి నాయకులు, మాజీ వైస్ ఎంపిపి బొడ్డు రాము, భార్య మంగళపాలెం సర్పంచి సత్యవతి, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు పాశిల క్రిష్ణ, పతివాడ అప్పలనాయుడు, తదితరులు టిడిపిలో చేరారు.